ధైర్యంగా ఉండాలి

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

భీంపూర్, మే 27 : భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తొనుపు నిఖిల్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు కేమ గంగయ్య, దొంతుల సుభాష్, సదానందం, మహేందర్ తదితరులు ఉన్నారు.

నర్సుల సేవలు వెలకట్ట లేనివి

ఎదులాపురం, మే 27 : రోగులకు నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్‌లోని రిమ్స్ దవాఖానలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై నర్సులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, స్టాఫ్ నర్సులు అరుణ, మంజుల, సుల్తానా పాల్గొన్నారు.

రిమ్స్ డైరెక్టర్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సులు

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలి

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌టౌన్, మే 27 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని నిర్మల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు సందర్భంగా అధికారులు, సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా ఓట్ల లెక్కింపును ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ అధికారులు జూన్ 4వ తేదీన ఉదయం 5.30 గంటలకు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని, అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించాలని ఆదేశించారు. రౌండ్ల వారీగా లెక్కించిన ఓట్ల వివరాలు తెలిపేందుకు స్క్రీన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సమయం లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత ఏఆర్వోలకు సమాచారం అందించాలని, రౌండ్ల వారీగా లెక్కింపు పూర్తికాగానే సంబంధిత ఫారాలు అన్ని జాగ్రత్తగా నింపాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ సిబ్బందికి ఓట్ల లెక్కింపు సరళిని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్లు కిశోర్ కుమార్, శ్యామలాదేవి, నిర్మల్, భైంసా,ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకళ్యాణి కోమల్ రెడ్డి, జీ వాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భగభగ మండే

● ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సూర్యనిప్పలు ● ఆదిలాబాద్‌లో 45.1, నిర్మల్‌లో 44.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు

● ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ● ముందు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా కలెక్టర్ చౌక్

జనసంచారం లేని ఎన్టీఆర్ చౌక్

తలకు టవల్ కట్టుకుని వెళ్తున్న వాహనదారులు

ఆదిలాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సోమవారం ఎండ దంచికొట్టింది. ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠంగా 45.2, నిర్మల్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం ఏడింటికే భానుడు భగభగ మండగా, సాయంత్రం ఏడింటి దాకా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ప్రజానీకం శీతల పానీయాలను ఆశ్రయించడంతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతుండగా, విద్యుత్ వినియోగం పెరిగింది. భానుడు నిప్పుల కుంపటిని తలపిస్తుండగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మూగజీవాల పరిస్థితి దయనీయంగా ఉంది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉండగా, ప్రజల్లో ఆందోళన కనిపిస్తున్నది.

ముందు జాగ్రత్తలే మేలు

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తలనొప్పి, కండరాలు పట్టేయడం, వికారం, కళ్లుతిగడం, వాంతులు చేసుకోవడంవంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, తాటి ముంజలు, దోసకాయ, లస్సీ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని సూచిస్తున్నారు. బైక్ మీద వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని,పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగు పట్టుకొని వెళ్లాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్‌ను తాగించాలని, అది దొరకని పరిస్థితుల్లో నీటిలో ఉప్పు లేదా పంచదారా వేసి తాగాలని, అపస్మారక స్థితిలోకి వెళ్తే నీరు తాగించకుండా వీలైనంత త్వరగా దవాఖానకు తరలించాలని డాక్టర్లు చెబుతున్నారు.

మంచిర్యాల కలెక్టర్ పేరిట

ఫేక్ మెసేజ్‌లు

మంచిర్యాల, మే 27, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాదవత్ సంతో ష్ పేరిట వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు రావడం కలకలం సృష్టించింది. కలెక్టర్ డీపీతో ఉన్న ఫేక్ వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్‌లు వస్తుండడంతో కలెక్టర్ జిల్లా అధికారులు, ప్రజలను అప్రమత్తం చేశారు. 94701389743 అనే వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్‌లు వస్తుండగా, దీన్ని ఎవ్వరూ నమ్మకూడదని, ఎవరికైనా మెసేజ్‌లు వస్తే వెంటనే నంబర్‌ను బ్లాక్ చేయాలని కలెక్టర్ సూచించారు.



మంచిర్యాల జిల్లా కలెక్టర్ డీపీతో వచ్చిన మెసేజ్

బాసర ట్రిపుల్ ఐటీ

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

జూన్ 1వ తేదీ నుంచి అప్లికేషన్లు

బాసర, మే 27 : బాసర ట్రిపుల్ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జూన్ 1వ తేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ట్రిపుల్ఐటీ బాసర అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్‌జీయూకేటీ.ఏసీ.ఇన్ వైబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆరేళ్ల పాటు ఇంటిగ్రేడెడ్ కోర్సులో ఇంజినీరింగ్ పూర్తి చేయవచ్చు. అడ్మిషన్ నోటిఫికేషన్‌పై పూర్తి వివరాల ప్రకటించక పోవడంతో ఎంత మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారో ఇంకా స్పష్టత రాలేదు.

విద్యార్థులకు ఆటా పాటలతో

విద్య నేర్పించాలి

● ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ● వేసవి శిబిరం సందర్శన

ఉట్నూర్, మే 27: పిల్లల సందడి వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా కోరారు. సోమవారం ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలో వికాసం ప్రత్యేక పాఠశాలలో భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిల్లల సందడి వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆటా పాటలతో బోధన చేయాలని, డ్రాయింగ్ పెయింటింగ్ లాంటి అంశాలలో శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఏటీడీవో క్రాంతి కుమార్, నీతి అయోగ్ సీపీవో రాహుల్, పీఎంఆర్‌సీ, ఆర్‌పీఎం గోవింద్ రావు, వికాసం ప్రిన్సిపాల్ వికాస్, భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

వేసవి భత్యం..అందేనా?

● రెండేళ్లుగా ఎదురుచూపులు ● నష్టపోతున్న ఉపాధి కూలీలు

నార్నూర్, మే 27 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఫిబ్రవరి నుంచి వేసవిలో అదనపు భత్యం అందించాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సమస్య కారణంగా అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి హామీ పథకం మొదలైనప్పటి నుంచి రాష్ట్రం రూపొందించిన టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ అమల్లోకి తీసుకువచ్చారు. 2022 వరకు దానిని వినియోగించారు. ఇందులో వేసవి భత్యాలకు సంబంధించిన అవకాశం లేకుండాపోయింది. దీంతో ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు.

పని చేస్తున్న కూలీల వివరాలు తెలుసుకుంటున్న అధికారుల (ఫైల్)

ఒక్కో నెల ఒక్కో మాదిరిగా....

వేసవిలో కూలీ శ్రమకు అదనంగా 20 నుంచి 30 శాతం వరకు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలలు పాటు అదనపు భత్యం అందించేవారు. ఒక్కో నెలలో ఒక్కో విధంగా చెల్లించే వారు. వేసవిలో ఒక కూలీ 60 శాతం పని చేస్తే దానికి 20 నుంచి 30 శాతం వరకు కలిపి..అంటే 80 నుంచి 90 శాతం వరకు పని చేసినట్లుగా డబ్బులు చెల్లించేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనపు భత్యం లభించేది. వేసవిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా అధికంగా శ్రమించాల్సి ఉంది. అలసట కారణంగా పూర్తిస్థాయిలో పని చేయలేరు. ఈ కారణంగా అదనపు భత్యం చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. అది రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, అయితే ప్రభుత్వం ఆదేశిస్తే నమోదు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఎక్కువ పనిదినాలు వేసవిలోనే...

నార్నూర్, గాదిగూడ మండలాల్లో అత్యధికంగా ఉపాధి హామీ పనులు చేస్తారు. యాసంగి వ్యవసాయ పనులు పూర్తి కాగానే వేసవిలో ఎక్కువ మంది ఉపాధి పనులకు హాజరువుతున్నారు. ఏప్రిల్ 1నుంచి జూన్ వరకు ఎక్కువ సంఖ్యలో ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. నిత్యం వేలాది మంది కూలీ పనులకు వస్తున్నారు. వీరికి ప్రతి రోజూ రూ.240 వరకు కూలీపడే అవకాశాలు ఉన్నాయి. కొంత మందికి రూ.100నుంచి రూ.150 వరకు వస్తుంటాయి. కూలీలకు రెండేళ్ల క్రితం వేసవి భత్యం ఆదుకుంది. ప్రస్తుతం చెల్లించే అవకాశం లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడతారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వేసవిలో ఒక్కో కూలీకి ప్రతిరోజూ రూ.40 నుంచి రూ.60 వరకు తగ్గే అవకాశం ఉంది.

పథకం అమలు ఇలా...

నార్నూర్, గాదిగూడ మండలాల్లో మొత్తం 48 గ్రామ పంచాయతీల్లో 12,450పైన కుటుంబాలు ఉండగా, 18 వేల జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరిలో యేటా దాదాపు 15వేలపైగా ఉపాధి కూలీ పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. గతేడాది వేసవిలో 70 శాతం మంది పనులకు వచ్చారు. యాసంగి పనులు ప్రారంభం కాగానే ఈ సీజన్‌లో కూలీల సంఖ్య కొంత తగ్గింది. ప్రస్తుతం అలవెన్స్‌లు తీసేశారనే సమాచారం తెలిస్తే ఇంకా కూలీల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. పథకం విజయవంతం కావాలంటే ఎండలో పనికి వెళ్లే కూలీలకు అలవెన్స్‌లు ఇవ్వకపోతే ఎలా సాధ్యమవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌లో అవకాశం లేదు..

కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి అలవెన్స్‌ల ఆప్షన్ లేదు. రెండేళ్ల నుంచి రద్దు చేశారు. అధికారులు నుంచి ఏమైనా ఆదేశాలు వస్తే నమోదు చేస్తాం. ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించే విధంగా పనులు గుర్తించారు. కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-జాదవ్ సురేశ్, ఈజీఎస్ ఏపీవో, నార్నూర్

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఎదులాపురం, మే 27 : ఈటీపీబీఎస్, ఈవీఎం కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆదిలాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని తన ఛాంబర్‌లో ఈవీఎం, ఈటీపీబీఎస్ (ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం) ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం కౌంటింగ్ సూపర్‌వైజర్లు 36, అసిస్టెంట్స్ 36, మైక్రో అబ్జర్వర్స్ 36 మొత్తం 108 మంది, అలాగే పోస్టల్ బ్యాలెట్ సూపర్‌వైజర్లు 17, కౌంటింగ్ అసిస్టెంట్స్ 34, మైక్రోఅబ్జర్వర్స్ 17 మొత్తం 68 మంది ఉన్నారని తెలిపారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ పరిధిలో ఈవీఎం కౌంటింగ్‌కు 14 టెబుల్స్ ఏర్పాటు చేశామని ఒక్కొక్క టేబుల్‌కు (నలుగురు) సూపర్‌వైజర్లు, ఇద్దరు కౌంటింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ఏడు సెగ్మెంట్లకు సంబంధించి 14 టేబుల్స్ ఉంటాయని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న 2219 మంది ఆన్‌లైన్ క్యూ ఆర్ కోడ్ స్కానర్ ద్వారా వారి యొక్క 13ఏ, 13బీ కవర్లను పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అరవింద్, టెక్నికల్ మేనేజర్ విలాస్, తదితరులు పాల్గొన్నారు.

30 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశాం

ఎదులాపురం, మే 27 : ఆదిలాబాద్ జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 30వేల మెట్రిక్ టన్నుల జొన్నలు 14,010 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామని జిల్లా మార్క్‌ఫెడ్ మేజేజర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా తొమ్మిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ కనీస మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ తర్వాత అన్ని కొనుగోలు కేంద్రాలు మూసివేస్తామని తెలిపారు. జొన్నలు అమ్మని మిగిలిన రైతులు తమకు సంబంధించిన మార్కెట్ యార్డ్‌లో పంట తేమ శాతం 14 ఉండే విధంగా ఆరబెట్టి, చెత్త లేకుండా శుభ్రపరిచి జొన్న కొనుగోలు ఈ నెల 31వ తేదీలోగా అమ్మి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3180 పొందాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్

ఎదులాపురం, మే 27 : ఆదిలాబాద్ జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ కంట్రోల్ రూమ్ సర్కిల్ ఆఫీస్‌ను ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఏమైనా విద్యుత్, లోవోల్టేజీ సమస్యలు, చెట్లు విరిగి వైర్లపై పడిన సమాచారం, ఓవర్‌లోడ్ సమస్యలు, తరచుగా విద్యుత్ అంతరాయం ఉంటే జిల్లా విద్యుత్ కంట్రోల్ రూమ్ సెల్ నంబర్ 9440811700కు సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ డ్యూటీలు 24గంటల పాటు వినియోగదారుల సౌకర్యార్థం పని చేయడం జరుగుతుందని తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ చైన్‌గేట్, మే 27: 2024-25 విద్యా సంవత్సరం కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్మల్ జిల్లా సంక్షేమ అధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి మార్చి 2024లో పదో తరగతి పరీక్షలో 7.0 జీపీఏకు పైగా ఫలితాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగుల విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in ద్వారా ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీజీజీ ఆన్‌లైన్ ఆటోమెటిక్ సిస్టం ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. జూన్ 6న సంబంధిత జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిచే ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేస్తారని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

● కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వై ప్రవీణ్ కుమార్

● కృషి విజ్ఞాన కేంద్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ఎదులాపురం, మే 27 : కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదిలాబాద్‌లోని కేవీకేలో సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించి కేవీకే అందించే సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా రైతులకు వ్యవసాయంలో సాగు పద్ధతులు తెలియజేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 731 కేవీకే కేంద్రాలున్నాయన్నారు. వీటి ద్వారా రైతుల సమస్యలు ,సాగు పద్ధతుల గురించి తెలియజేస్తున్నట్లు వివరించారు. రైతులు కూడా శాస్త్రవేత్తలు చెబుతున్న సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖల అధికారులు రమేశ్, సుధాకర్, కిసాన్, అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్, శాస్త్రవేత్తలు రాజేందర్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ వై ప్రవీణ్ కుమార్